


# మగువ మనసు

బి.టి. పద్మినీదేవి

'అమ్మా! నాకా పెన్సిలు కావాలి... ఊఁ...' పెద్దగా రాగాలు తీస్తున్నాడు రవి వాడి ఏడుపుకు పెంకులెగిరిపోయేలా ఉన్నాయ్.

'ఏమిటిరా' అంటూ గదిలోకి వచ్చింది భార్గవి.

రవి ఏడుస్తూనే చందు చేతిలో పెన్సిల్ లాగటానికి ప్రయత్నం చేస్తున్నాడు. చందు మాట పైకి రాలేదు కాని అన్నకా పెన్సిలు ఇవ్వటానికి ఏ మాత్రం వాడు సుముఖంగా లేదు.

'ఇద్దరికీ చెరో పెన్సిలు ఉన్నాయి కాద్రటా' అంది భార్గవి.

'అన్నయ్య బళ్ళో పారేసుకొన్నాడు' అన్నాడు చందు.

'నీది పారేసుకుని వాణ్ణి ఇమ్మంటా వేంరా వెధవా! ముయ్యి నోరు' ఒక్క గుద్దు గుద్దిమి రెక్క పుచ్చుకొని రవిని ఇవతలకి లాగిందామె. దాంతో రవి ఏడుపు తారాస్థాయికి అంటింది. నేలమీద వెల్లకిలా పడుక్కొని కాళ్ళూ చేతులూ నేలకేసి బాదుతూ నానా హంగామా చేసేస్తున్నాడు వాడు

అనుకున్నది అయితేనే కాని వాడు పట్టు వదలడు. భార్గవికేం తోచలేదు. మెరిసిపోయే రెండు పెన్సిళ్ళు, రెండో చివరి చిన్ని బొమ్మలున్నవి తండ్రి తెచ్చాడు బొంబాయినించి. అందులో తనవి పారేసి తమ్ముడి పెన్సిలుకోసం పేచీ పెడుతున్నాడు పెద్దవాడు. అలాంటివి దొరకడంలేదిక్కడ కొందామంటే. చందూ పెన్సిలు రవి కిప్పించటం ఏం న్యాయం గనక.

'ఛీ వెధవా! ఏడు.' చిరాగ్గా హాల్లో కొచ్చి కూచుంది భార్గవి. చందూ మెల్లగా తల్లిదగ్గిరకొచ్చాడు. 'అమ్మా' అంటూ.

'పోనీ అన్నయ్య కిచ్చెయ్' పెన్సిలు తల్లి వళ్ళో పెట్టాడు. భార్గవి మనసు అదోలా అయిపోయింది

సాధారణంగా పెద్ద పిల్లలకన్న చిన్న వాళ్ళే పెంకిగా ఉంటారు. తమ్ముని పట్టుదలకి అన్న తలఒగ్గటం ఉంటుంది కాని ఇలాగుండదు.

రవి అంటే ఒళ్ళు మండింది భార్గవికి. 'ఏ మక్కర్లేదు. నీ పెన్సిలు నీ దగ్గరే ఉంచు. వాడి సంగతి నేను తేలుస్తాను' అనేసింది.

తల్లికంత కోపం ఎందుకొచ్చిందో ఆరేళ్ళ ఆ పసివాడికి అర్థంగాలేదు. పెన్సిలు తీసుకొని దూరంగా వెళ్ళిపోయాడు.

రవి ఇంకా పెద్దగా ఏడుస్తూనే ఉన్నాడు. భార్గవి మనస్సు అల్లకల్లోలం అయిపోయింది. మొండితనంతో ఏదైనా సాధించవచ్చు. మెత్తగా ఉండేవాళ్ళు ఎక్కడైనా ఎదురు దెబ్బలు తింటూనే ఉంటారు రవి, చంద్ర పెద్ద వాళ్ళవుతూన్న కొద్దీ భార్గవికి తన జీవితం గుర్తుకు వస్తోంది. అందుకు కారణం — మాధవి భార్గవి అక్కచెల్లెళ్ళు— రవి చంద్ర స్వభావాలు ఆ అక్కచెల్లెళ్ళకు ప్రతిబింబాలు.

సోఫాలో చేరబడిపోయింది భార్గవి తల నొక్కుకుంటూ.

మాధవికి మూర్తికీ ఆరునెల్లు తేడా. అందుకే భార్గవికి మేనరికం ఖాయమన్నారు చిన్నతనంలోనే. మాధవి తర్వాత ఏడేళ్లకు పుట్టింది భార్గవి.

ఊహ తెలిసినప్పటినుంచి భార్గవి మూర్తిబావ ఎదట పడటానికే సిగ్గుపడిపోయేది. అక్క మూర్తితో కలసి ఆడుతూంటే కిటికీలోంచి చూసేది. అలా భార్గవి తన ఊహలతోబాటు పెరిగి పదహారేళ్ల పడుచైంది.

ఒకరోజు — ఆ రోజు మూర్తి ఊరు నించి వచ్చాడు. చదువై ఉద్యోగంలో చేరటానికి వెడుతున్నాడు.

మాధవికి సంబంధాలు చూస్తూ ఉన్నారు. ఎన్ని సంబంధాలు వచ్చినా ఏదో ఒక వంకపెట్టి తిరగ్గొడుతూనే ఉంది మాధవి.

'పెద్దదానికి కుదిరితే, ఇద్దరికీ ఒకే సారి ముడిపెట్టవచ్చు. త్వరగా ఏదో ఒకటి కుదర్చండి.' అని మూర్తి తల్లి చెప్పి వెళ్ళిందికూడా.

భార్గవి లెవెన్త్‌క్లాస్ చదువుతోంది. స్కూలునించి ఇంటికివచ్చి పుస్తకాలు గదిలో పడేసింది.

'ఇదేమిటే, నీకేమైనా మతిపోయిందా! వాడికి నీకు ఆరునెల్లేకదా తేడా! మొన్న చూసి వెళ్ళిన కుర్రాడు వీడికేం తీసిపోయాడూ నిక్షేపంలా ఉంటేనూ' తల్లిమాటలు వింటూ కదలకుండా అక్కడే నిలబడిపోయింది భార్గవి.

'అంత నిక్షేపంలా ఉన్న సంబంధం నీ చిన్నకూతురికే చెయ్యొచ్చుగా. నాకు నిక్షేపాలేమీ అక్కర్లేదు, అడిగింది అవునంటే చాలు.'

'అవ్వ ఏం మాటలే ఇవి ఇన్నాళ్లనిరిచి అనుకున్న దేమిటి ఇప్పుడు నువ్వనే దేమిటి? చిన్నప్పటినించి మూర్తికి దానికీ అనుకున్నాం గదా! ఇప్పు డెలాగ' అంది తల్లి.

దాంతో మాధవి గొంతు హెచ్చిపోయింది. 'అంత అనుకుంటే ఇక నా అభిప్రాయం అడగటం ఎందుకూ? ఒక బండ నా మెడకట్టి నూతిలో దింపెయ్ పీడా వదిలిపోతుంది!'

'వింటున్నారటండీ! మీ ముద్దుల కూతురి మాటలు! లేకలేక పుట్టిం దంటూ బాగా నెత్తి కెక్కించుకున్నారు. ఇప్పుడది పట్టిన కుందేటికి మూడే కాళ్ళు! ఎవరైనా వింటే నవ్విపోతారు. అయినా వాడుమాత్రం ఒప్పుకోవద్దూ. చిన్నప్పట్నించి భార్గవిని ఇద్దామను కుంటిమి.' తల్లికి మాధవి మాటలు ససేమిరా నచ్చలేదు.

భార్గవి మనస్సు ఎక్కడ బాధ పడుతుందో అని ఆమె తల్లడిల్లి పోతూనే ఉంది. మాధవి పెంకితనం అమెకు తెలియంది కాదు.

మూర్తిని చేసుకుంటానని మాధవి పట్టుబడుతూ ఉంది. దీన్లో ఒక్కబాధ కాదు ఆరునెల్లచిన్నే అయినా మాధవిని కోడలు చేసుకోటానికి మేనత్త అంగీకరించాలి. ఎలాగో ఒప్పించినా భార్గవిని కాకుండా మాధవిని పెళ్ళాడటానికి మూర్తి ఒప్పుకోవద్దూ.

మూర్తి మెడలు వంచి ఒప్పిస్తే చిన్ననాటినించి ఆశలు పెంచుకున్న తమ చిన్నకూతురు మనస్సు ఎంత గాయపడుతుందో! ఇన్ని సమస్యలతో తల్లిదండ్రులిద్దరూ ఉక్కిరి బిక్కిరయ్యారు.

'చేసుకునేవాడు మూర్తి. ముందర వాడిని అడుగుతాం. వాడొప్పుకుంటే సరి. లేకపోతే నువ్వు మేం చెప్పినట్లు వినాలి' అన్నమాటకు కొంత శాంతించింది మాధవి.

భార్గవి గుండెలు గుబగుబ లాడుతూనే ఉన్నాయి. రాత్రి పది దాటిన తర్వాత నాన్న మూర్తిని పిలిచాడు. అడుగులో అడుగు వేసుకొంటూ వెళ్ళి గోడవారను చేరింది భార్గవి గుండెలన్నీ చెవులో కూర్చుకుని తహతహలాడే మనస్సుతో వింటూంది.

'నాయనా! మూర్తి నీకప్పుడే అక్కర వచ్చిందిరా! ఇన్నాళ్ళుగా భార్గవిని పెళ్ళి చేద్దాం అనుకున్నామా! ఇప్పుడు మాధవిది ఒక పెద్ద ప్రశ్న అయిందోయ్. దానికి పచ్చ చెప్పలేకుండా ఉన్నాం. నేనూ బావకంటె చిన్నదాన్నే కాదా అంటుంది. ఏన్ని సంబంధాలైనా తిరగొట్టేస్తుంది మనకో, ఏం చెయ్యాలో తోచటంలేదు. ఏమయినా ఒక్క మాట నా యిద్దరి పిల్లల్లో ఎవర్నెంచుకున్నా నాకు సంతోషమే. ఇక నీ యిష్టం'

ఒక్కక్షణం నిశ్శబ్దం. మేనమామ మాటలకు మెత్తగా నవ్వాడు మూర్తి. 'అదేమిటి మామయ్యా! మీ పెద్దలంతా ఏమి నిర్ణయిస్తే అదే. నా కెవరైనా ఒకటే' అనేశాడు.

చివ్వున మంచంమీద వాలిపోయింది భార్గవి. మెల్లగా వచ్చి మంచం మీద పడుకున్నుంటున్న మాధవి మాత్రం భార్గవి సంగతి గుర్తించలేదు. ఒకేమాట 'ఎవరైనా ఒకటే' అన్న ఒకేమాట భార్గవి హృదయంలో అగ్ని పర్వతాన్ని రగిలించింది. మాధవి మనస్సులో మల్లెలను విరియించింది.

మూర్తి నిర్ణయం విని భార్గవి వైపుచూసి మనస్సులోనే వ్యథపడింది తల్లి. ఒక నిట్టూర్పు విడిచాడు తండ్రి.

'ఇప్పుడు నా పెళ్ళికేం తొందరనాన్నా! నాకు బాగా చదువుకోవాలని ఉంది,' అని తలవంచుకొని చెబుతున్న భార్గవి మాటలను కాదనేశక్తి ఆయనకు లేకపోయింది.

మాధవి మూర్తితో వెళ్ళిపోయింది. భార్గవి ఆరేళ్ళచదువు పూర్తిచేసి ఉద్యోగంలో చేరింది.

'అమ్మా అమ్మా నాన్నొచ్చాడు' నీరసంగా సోఫాలో వాలిపోయిన భార్గవి ఉలిక్కిపడి లేచింది ఆ మాటలకు.

'వెళ్ళి వారం కాలేదు' మనసులోనే అనుకుని 'ఉత్తరమైనా వ్రాయకుండా వచ్చారు. కూర్చోండి' అంది.

'అనుకోకుండా ఆఫీసు పనిమీద ఇటొచ్చాను. అందుకే ఉత్తరం వ్రాయలేదు' అంటూ కూర్చున్నాడతను.

'నాన్నా! అన్న పెన్సిల్ పారేసుకొని నన్నియ్యమంటున్నాడు' చంటూ అప్పుడే నేరాలు చెప్పటం ప్రారంభించాడు.

భార్గవి కాఫీ తీసుకొచ్చింది. పిల్లలిద్దరు తండ్రిమీద పడిపోతున్నారు. 'కాఫీ తీసుకోండి' అంది భార్గవి.

'పిల్లల్ని వదలి ఉండటం కష్టంగానే ఉంది.'

భార్గవి తలవంచుకొని గడప కానుకొని నిలబడి ఉంది. ఆ మాటలకు ఆమె సమాధానం చెప్పలేదు. కొంచెంసేపు భార్గవి సమాధానంకోసం ఎదురు చూసి 'నాతో వచ్చేస్తార్రా' అన్నాడు పిల్లల్ని. 'అమ్మవస్తే మేం వస్తాం' పిల్లలిద్దరూ ముక్తకంఠంతో జవాబు చెప్పేశారు. అమ్మవిషయంలో ఆ అన్నదమ్ములిద్దరికి ఎలాటి అభిప్రాయభేదాలూ లేవు 'నేనొక గంటలో వెళ్ళిపోవాలి. హోటల్ భోజనం చాలా ఇబ్బందిగా ఉంది. ఒంటరిగా ఉండలేక పోతున్నాను. మీరొచ్చేస్తే బాగుంటుంది' ప్రార్థనా పూర్వకంగా ఉన్నా ఆ మాటలు భార్గవి నిశ్చయాన్ని మాత్రం కదల్చలేక పోయాయి —

'ఎన్నిసార్లు చెప్పమంటారు బావా అక్కపోయిన ఈ మూడేళ్ళలో మీరెన్నిసార్లీ ప్రశ్న వేశారు' భార్గవికి చెప్పటం కొంచెం కష్టంగానే ఉంది.

మూర్తి ఈసారి తేల్చుకోవాలనే వచ్చాడు. అందుకే భార్గవి సమాధానంతో అతను ఊరుకుండలేదు.

'అసలు నీ మనస్సులో ఉన్నదేమిటి భార్గవీ! చిన్ననాడు అనుకున్నట్లే జరిగి ఉంటే నువ్వే నా భార్యవి అయ్యేదానివి. పోనీ నా పిల్లలు అడ్డమా అంటే వాళ్ళని ఎలాగూ నీవే పెంచుతుంటివి ఇక ఏ కారణంవల్ల ఇలా ప్రవర్తిస్తున్నావో నాకర్థం కావటంలేదు. నేను పరాయివాడిని కాదే.'

తలవంచుకొని బొటనవేలుతో నేల రాస్తూ మౌనంగానే ఉండిపోయింది భార్గవి.

'అయితే నాపిల్లల్ని నేను తీసుకు పోతాను' విసురుగా లేచాడు మూర్తి. భార్గవి పిల్లల్ని వదలి ఉండలేదని అతనికి తెలుసు. మూడేళ్ళుగా సాధించలేనిదాన్ని సాధించటంలో తన మాట బ్రహ్మాస్త్రంగా పని చేస్తుందని అతను భావించాడు.

అమ్మ రానంటున్నదని తమల్ని తీసుకు వెడతానని నాన్న అంటున్నాడని పిల్లలకి అర్థమైపోయింది. 'అమ్మ రాక పోతే మేం రాం' అంటూ పరుగెత్తుకు వెళ్ళి భార్గవిని చుట్టుకుపోయారు.

'భార్గవీ! నే నెన్నాళ్ళిలా ఉండి పోయేది. నీ మూర్ఖత నాకర్థంగావటం లేదు. నాపిల్లల్ని వశపరచుకొని' మూర్తి మాటల్లోనే 'బావా!' అంటూ గర్జించింది భార్గవి.

'నిన్నిలా ఉండిపొమ్మని నేననలేదు. హాయిగా పెళ్ళిచేసుకో. మళ్ళీ నీకు ఏ ఆడదైనా ఒకటే కాని నాకు అలా కాదు. 'నేనే సర్వస్వం' అనుకునేవాడే కావాలి. ఎవరైనా ఒకటే అనుకునే నీలాంటివాడు నాకోసం ఇన్నేళ్ళు ఆగని లేదు. పిల్లలు నా అక్కపిల్లలు. వాళ్ళ బాధ్యతకూడా నాకవసరం లేదు.' భార్గవి ఆవేశంతో ఆ మాటలనేసి పిల్లలిద్దర్ని చెరో రెక్క పట్టుకుని లోపలికి లాక్కెళ్ళిపోయింది. నిశ్చేష్టుడై భార్గవి వెళ్ళిన వైపే చూస్తూ ఉండి పోయాడు మూర్తి. ●

